

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,29 డిశంబర్ 2025


8 పేజీలు


## కోనసీమ తిరుమలలో

# నవశకం



- నేడే వాడపల్లి వేంకన్న 'పాలక' పట్టాభిషేకం!
- రాష్ట్ర స్థాయి గుర్తింపుతో భారీ కమిటీ..
- చైర్మన్‌గా వెంకటరాజు (గబ్బర్ సింగ్) ప్రమాణ స్వీకారం



బండారు సత్యానందరావు



నల్లం సూర్య చక్రధర్ రావు



వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

తెలుగు రాష్ట్రాల్లో 'కోనసీమ తిరుమల'గా నీరాజనాలు అందుకుంటున్న వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం నేడు నూతన జవసత్వాలను సంతరించుకోనుంది. ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరగనుంది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో,ఆలయఈవో నల్లంసూర్య చక్రధరరావు స్వీయ ఏర్పాట్ల పర్యవేక్షణలో ముదునూరి వెంకటరాజు చైర్మన్‌గా, మరో 17మందితోపాలక మండలి సభ్యులు స్వామివారి సేవలో కొలువుదీరనున్నారు.

**విశేషాలు: జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి!**

గతంలో కేవలం నియోజకవర్గ స్థాయి నాయకులతో పరిమితమైన పాలక మండలి, ఈసారి రాష్ట్ర స్థాయి ప్రాముఖ్యతను సంతరించుకుంది. భక్తుల రద్దీ, ఆలయ ఖ్యాతి దృష్ట్యా కూటమి ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులను ఎంపిక చేసింది.

**కూటమి సమతుల్యం :**

17 మంది సభ్యులలో టీడీపీకి 14, జనసేనకు 2, బీజేపీకి 1స్థానంకేటాయించి రాజకీయ సమతుల్యాన్ని పాటించారు.

**ప్రాంతీయ ప్రాతినిధ్యం :** ఒంగోలు, కృష్ణా, పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుంచి కూడా ఒకరికి చోటు కల్పించడం విశేషం.

**చైర్మన్ పదవికి 'గబ్బర్ సింగ్' ఎంపిక వెనుక..**

రాష్ట్రస్థాయిలో తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, పార్టీ కష్టకాలంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వెన్నంటి నిలిచిన ఆత్రేయపురం నేత ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) కేచైర్మన్ పదవి దక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఒప్పించి కొత్తపేట ఎమ్మెల్యే బండారు తన అనుచరుడికి ఈ అత్యున్నత అవకాశాన్ని కల్పించడంతో ఆయన కీర్తిని సంపాదించారు.

- తరువాయి 2లో..

## టిడిపి మండల

# విస్తృతస్థాయి సమావేశం

- కార్యకర్తలే బలం, బలగంగా ఉన్న పార్టీ తెదేపా...
- సామాన్యులను నాయకులుగా తీర్చిదిద్దిన పార్టీ మనది....
- రావులపాలెం తెదేపా మండల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....





**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** దేశంలో ఏ పార్టీకి లేనంత కార్యకర్తల బలం, బలగం తెలుగుదేశం పార్టీ సొంతమని కొత్తపేటఎమ్మెల్యేబండారు సత్యానందరావు అన్నారు.ఆదివారం రావులపాలెం కాపు కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మొదటగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ పదవులు పొందిన నాయకులను ఆయన సత్కరించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బాగా నిర్వహించిన కార్యకర్తలకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి అందిన ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ విధ్వంసక, అరాచక, రాక్షస పాలనకు

- తరువాయి 2లో..

## అన్నవరం కొండపై

# 'దొంగ' కలకలం

- భక్తుల రక్షణ గాలికేనా..? అధికారుల మాటల్లో నిజమెంత?
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇటువంటి చిన్న చిన్న దొంగతనాలు మీద ఫిర్యాదు చేయగలరా..?

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం రత్నగిరిపై భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నిత్యం వేలాదిమంది భక్తులతో కిటకిటలాడేసత్యదేవుని సన్నిధిలో పట్టపగలే దొంగతనం జరగడం స్థానికంగా పెనుసంచలనం సృష్టిస్తోంది.ఘటన వివరాల్లోకివెళ్తే...కొండపై రూముల బుకింగ్ కోసం భక్తులు సిఆర్ఓ ఆఫీస్ వద్ద వేచి ఉన్న సమయంలోఆదివారంఈఘటన చోటుచేసుకుంది. క్యూలైన్‌లో ఉన్నఓమహిళాభక్తురాలు చేతిలోని పర్సును ఒక ఆగంతకుడు అమాంతం లాక్కొని అత్యంత వేగంగా పారిపోయాడు. ఊహించని ఈ పరిణామంతో భక్తులు షాక్‌కు గురయ్యారు.

**- సెక్యూరిటీ 'నిద్ర'పోతోందా..?**

దొంగతనం జరిగిన వెంటనే బాధితురాలు అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డులకు మొరపెట్టుకోగా, వారు కనీసం స్పందించకపోవడం గమనార్హంగా భక్తులు తెలుపుతున్నారు. "మాకేం సంబంధం లేదు" అన్నట్లుగా వ్యవహరించిన సెక్యూరిటీ సిబ్బంది తీరుపై భక్తులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రక్షణ కల్పించాల్సిన వారే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే, ఇకసామాన్య భక్తులకు రత్నగిరి కొండపై భద్రత ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారు. సెక్యూరిటీ ఎస్ఓ బుకాయింపు – సీసీ ఫుటేజ్ ఏం చెబుతోంది..? ఈ విషయంపై ఆలయ సెక్యూరిటీ ఆఫీసర్‌ను వివరణ కోరగా, ఆయన విడ్డూరమైన




స్పీడ్‌గా వేగంగా పారిపోతున్న దొంగ

- తరువాయి 2లో..

# దైవ భక్తితో పాటు అందరూ దేశభక్తిని అలవర్చుకోవాలి







– జాగరంపల్లిలో ఘనంగా హిందూ సమ్మేళనం

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** దైవ భక్తితో పాటు అందరూ దేశభక్తిని అలవర్చుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గోదావరి విభాగ్ కార్యకారిణి, ముఖ్య ఉపన్యాసకులు శ్రీ చక్రధారి పిలుపునిచ్చారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది, 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం జాగరంపల్లి గ్రామంలో ఆదివారం హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభమైన సమ్మేళనంలో గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సమ్మేళనానికి వచ్చిన పెద్దలు దిశా నిర్దేశం చేశారు. ముఖ్య ఉపన్యాసకులుగా వచ్చిన చక్రధారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ వికాసం కోసం పంచ పరివర్తన విషయాల మార్పు కై ప్రయత్నించాలని కోరారు. విశిష్ట అతిధి శ్రీశ్రీశ్రీ విశ్వానంద భారతి దత్త స్వామి మాట్లాడుతూ హిందూ ఆచర పద్ధతులు విశిష్టమైనవని, భారతీయ జీవన విధానంలోనే అందరూ జీవించాలని కోరారు. ఈకార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన శక్తి సంస్థ డైరెక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ గిరిజన సంస్కృతిలో అంతర్లీనంగా అనేక సైన్స్ విషయాలు దాగి ఉన్నాయని, హిందూ ధర్మంలోని గిరిజన సంస్కృతి ఉత్తమమైనదని కొనియాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదిపట్ల శ్రీ కళా పీఠం హైందవ సంస్థ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బలక్ష్మి మడకం సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఎవరూ మతం మార్చుకోవాల్సిన అవసరం లేదని, గిరిజన సంస్కృతి ఉత్తమమైనదని తెలియజేసారు. ఈ హిందూ సమ్మేళనానికి వేల మంది హిందూ బంధువులు హాజరై, సమ్మేళనాన్ని జయప్రదం చేశారు.

హిందూ సమ్మేళనానికి, ఎస్.టి. కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం మాజీ ప్రెసిడెంట్ తిరువీది సుబ్రమణ్యం, రంపచోడవరం హిందూ సమ్మేళనం అధ్యక్షులు నల్లమిల్లి వెంకట రామారెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పోలవరం నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలుపుతా





**కొయ్యలగూడెం, మేజర్ న్యూస్** పోలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతానని, గత ఏడాదిన్నర కాలంలో ఇప్పటివరకూ రూ.57కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చానని, ఎమ్మెల్యే చిర్రిబాలరాజు అన్నారు. ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కూడా ఈ నియోజకవర్గ అభివృద్ధికి ఏడాదిన్నర కాలంగా అత్యధికంగా రూ.50కోట్లు నిధులు ఇచ్చారని ఆయన చెప్పారు. మండలంలోని కుంతలగూడెంలో రూ.32 లక్షలతో నిర్మిస్తున్న పంచాయతీ భవనానికి ఆదివారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆయన శంఖుస్థాపన చేశారు. కుంతలగూడెం గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. పంచాయతీ కార్యాలయానికి నిధులు మంజూరు చేయించడంతో పాటు, రూ.20లక్షలతో ఇప్పటి వరకూ సీసీరోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యాలయపు శంఖుస్థాపనతో పాటు జెడ్పీ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన సీసీ డ్రైయిన్, మరో రూ.5లక్షలతో నిర్మించిన తాగునీటి వాటర్ ట్యాంకును కూడా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్ ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ పులి నాగరత్నం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్ ప్రసంగించారు. ఈ గ్రామానికి ఏ లోటు రానివ్వనని, అన్నీ ప్రభుత్వ శాఖల ద్వారా అందవలసిన అభివృద్ధి పథకాలను ఇక్కడ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ కుంతలగూడెం గ్రామానికి జిల్లా పరిషత్ నుంచి సిమెంట్ డ్రెయిన్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.20లక్షలు జెడ్పీ నిధులు మంజూరు చేసామని,మరో రూ.20 లక్షలు ఇప్పుడే మంజూరు చేస్తున్నాని సభాముఖంగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలో జిల్లాతో పాటు, పోలవరం నియోజకవర్గం కూడా ఎంతో అభివృద్ధి చెందిందని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సీ మాజీ చైర్మన్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి రామారావు మాట్లాడుతూ వైసీపీ అనుసరిస్తున్న దౌర్జన్యకర విధానాలను దుయ్యబట్టారు. గోపాలపురం ఏ.ఎం.సీ మాజీ చైర్మన్ గెడ్ మురళీ అజిత్ కుమార్, కుంతలగూడెం గ్రామ నాయకుడు గెడా సూర్యప్రకాష్ తదితరులు ప్రసంగించారు.

# అన్నవరం కొండపై 'దొంగ' కలకలం

మొదటిపేజీ తరువాయి

సమాధానం ఇచ్చారు.ని"అసలు దొంగతనమే జరగలేదు.. ఎవరో కావాలని పరిగెత్తారు తప్ప భక్తులు ఏమీ పోగొట్టుకోలేదు. మాకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు" అని కొట్టిపారేసే ప్రయత్నం చేశారు.

కానీ, బయటకు వచ్చిన సీసీటీవీ ఫుటేజ్ వీడియో మాత్రం మరోలా ఉంది. వీడియోలో ఒక వ్యక్తి అత్యంత వేగంగా, ఏదో దొంగిలించినట్లుగా పరుగు తీయడం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవేళ దొంగతనం జరగకపోతే, అంత వేగంగా పారిపోవాల్సిన అవసరం ఆ వ్యక్తికి ఏముంది..? భక్తుల దగ్గర ఏమీ లాక్కోకుండానే అతను ఎందుకు పరిగెత్తాడు? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. అధికారుల బాధ్యత ఏది..? కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే అన్నవరం దేవస్థానంలో భక్తుల భద్రత విషయంలో ఇంతటి ఉదాసీనత తగదు. పవిత్ర పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు ఇలాంటి అనుభవాల వల్ల భయాందోళనకు గురవుతున్నారు.

-ఆ పరిగెత్తిన వ్యక్తి ఎవరు..?

-అధికారులు ఎందుకు ఈ విషయాన్ని తక్కువ చేసి చూపిస్తున్నారు..?

బాధితురాలు ఫిర్యాదు చేయలేదనే సాకుతో దొంగతనాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారా..? సుదూర ప్రాంతాన్ని చూచే భక్తులు కొట్టుకున్న సొమ్ము కోసం పోలీసులకు ఫిర్యాదు చేయలేని స్థితిని దొంగలు అనుకూలంగా మలుచుకుంటున్నారా అన్న అనుమానాలు కూడా భక్తుల్లో ఉన్నాయి.

ఇప్పటికైనా ఆలయ ఉన్నతాధికారులు స్పందించి, సీసీ ఫుటేజ్ ఆధారంగా సదరు వ్యక్తిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతను కట్టుదిట్టం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.

# కోనసీమ తిరుమలలో నవశకం

మొదటిపేజీ తరువాయి

**పాలక మండలి సభ్యుల జాబితా :**

నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న వారిలో ప్రముఖులు :

- ముదునూరి వెంకటరాజు (చైర్మన్)
- చలుమూరి రాంబాబు (ఆచంట)
- గంగవరపు పద్మావతి (ఒంగోలు)
- కొండపల్లి రామచంద్రరావు (తెలంగాణ)
- దళపర్తి శ్రీలక్ష్మి (పామర్రు)

వీరితో పాటు మొత్తం 17 మంది సభ్యులు మరియు ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

"ఏడు వారాల వాడపల్లి వెంకన్న దర్శనం - ఏడేడు జన్మల పుణ్యఫలం" ఈ విశ్వాసాన్ని మరింత పటిష్టం చేస్తూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కొత్త బోర్డు అడుగులు వేయనుంది...

**ఏర్పాట్లు పూర్తి :** దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాజకీయ, ఆధ్యాత్మిక ప్రముఖుల రాకతో వాడపల్లి క్షేత్రం కిటకిటలాడుతోంది.

# టిడిపి మండల విస్తృతస్థాయి సమావేశం

మొదటిపేజీ తరువాయి

చరమగీతం పాడి,ప్రజలు అపూర్వమైన మెజారిటీతో కూటమిని అధికారం ఇచ్చారని ఎమ్మెల్యే అన్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని మెజారిటీతో 164స్థానాలు సాధించా మంటే ఈ ఫలితాల వెనుక ఉన్న కార్యకర్తల శ్రమ, త్యాగాలు మరువలేనివన్నారు. వారందరికీ తప్పకుండా న్యాయం జరుగుతుందని అన్నారు. రావులపాలెంలో ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో గుంతల రహదారులతో ప్రజలు పడిన ఇబ్బందులను తొలగించడానికి నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతులు జోరుగా చేస్తున్నామన్నారు.దేవాదాయశాఖ నిధులతో దేవాలయాల అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను కూటమి గెలిచేలా కృషి చేయాలన్నారు.ఉపాధి కల్పనకు ఎంతగానో కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈ సదస్సులు నిర్వహించామని డ్వాక్రా మహిళలు, యువత స్వయం ఉపాధికి సంబంధించిన ఆలోచన చేస్తే సబ్సిడీ రుణం అందేలా అవగాహన కోసం రావులపాలెంలో కార్యాలయం ఏర్పాటు జరిగిందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మరీ ముఖ్యంగా డ్వాక్రా సంఘాల సభ్యులు, యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రిస్మస్ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న పాస్టర్ లందరికీ నెలకు రూ.5వేల చొప్పున ఒకేసారి 12 నెలలకు గాను రూ. 60వేలు జమ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత ద్వారానే రోగాలు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. మంచి సమాజాన్ని నిర్మించవచ్చుని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కె.వి.సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, కేతా శ్రీను, మాసబత్తుల ఆనందరావు, కాసా సాగర్, కొప్పిశెట్టి ప్రసాద్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 150 మంది పేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**భీమడోలు,మేజర్ న్యూస్ :** వివిధ రూపాలలో ఇబ్బందులు పడు తున్న వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్న స్వచ్ఛంద సంస్థ మానవత,భీమడోలు శాఖ చేస్తున్న కృషి అభినందనీయమని జనసేన పార్టీ నాయకులు వట్టి పవన్ కుమార్ అన్నారు.పూళ్ళ గ్రామపంచాయతీ పరిధిలోని ఎం.ఎం.పురం ఆవాస ప్రాంతంలో మానవత శాఖ 150 మంది నిరుపేద వృద్ధులకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వట్టి పవన కుమార్ మానవత భీమడోలు శాఖ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేసిన వట్టి వీర వెంకట సత్యనారాయణ 102 వ జయంతి పురస్కరించుకొని,ఆయన కుటుంబీకులు,మానవత అభివృద్ధి కమిటీ సభ్యులు వట్టి సుగుణాకర్ ఆయన జ్ఞాపకార్థం నిరుపేదలలో పురుషులకు టవల్స్,మంకీ క్యాప్‌లు,మహిళలకు టవల్స్,స్కార్ఫులను అతిధులు అందజేశారు.

# చేయూత రవి సమాజ సేవలు స్ఫూర్తిదాయకం

– కొండబాబు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటూ గత 19 సం.రాలుగా తనకొచ్చిన జీవితంలో కొంత మొత్తాన్ని సమాజానికి ఉపయోగిస్తూ తన తోటి ఉద్యోగ ఉపాధ్యాయులందరితో కలిసి 8సం. రాల క్రితం డా. మొండి రవికుమార్ (చేయూత రవి) చేయూత సంస్థను ఏర్పాటు చేసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు ప్రతిరోజు కాకినాడ మరియు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గర్భిణీ స్త్రీలకు మరియు రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవారంగానికే కొత్త నిర్వచనం ఇచ్చారని కాకినాడ అర్బన్ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక ఎన్‌జిఓ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో డా. రవిని శాశసన సభ్యులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకి రక్తదానం కార్యక్రమం తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులకి ఉచిత విద్య వైద్యం వసతి భోజన సదుపాయాలతో చిల్డ్రన్ హోమ్ ఏర్పాటు చేసి కట్టు బట్టలతో వచ్చిన వారికి ఉపాధి వచ్చేవరకు కృషి చేయడం గొప్పవిషయమని అన్నారు. అత్యవసర సమయాల్లో వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం అందించడం వినికిడి లోపంతో మూగబోతున్న చిన్నారులకి స్పీచ్ తెరఫీ ట్రైనర్లు, ఫిజియోథెరపీ మెషిన్లు భవిత సెంటర్లుకు అందించడం, దివ్యాంగులకు జీవనోపాధి కల్పించడం, ట్రై సైకిల్స్, వీల్ చైర్ అందించడం, ఆర్థికంగా వెనుకబడి ఉన్నత భవిష్యత్ కలిగిన చిన్నారులకి ఉన్నత చదువులు చదివించడం, ఇలా అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న చేయూత రవికుమార్‌ని కొండబాబు అభినందించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ఉద్యోగుల పాత్ర కీలకమని, చేయూత రవి లాంటి ఉద్యోగులు ఉండటం కాకినాడ అదృష్టమని, ఉన్నదానిలో దానం చేయడం ఒక అలవాటుగా తను మార్చుకోవడమే కాకుండా తన పరిధిలో ఉన్నవారిని మరిము మిత్రులను భాగస్వామ్యం చేస్తూ అనేక సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నారనీ ఉద్యోగ ఉపాధ్యాయులతో పాటుగా ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారని భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్నా కూటమి ప్రభుత్వం తరుపున అండగా నిలుస్తామని రవికుమార్ సేవలకు హామీ ఇచ్చారు. శాశ్వత భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం తరుపున కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఆర్మీతో పాటు మంచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షులు జి.మోహన్ రావు, కార్యదర్శి మూర్తి బాబు, మీనాక్షి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు ఆశీర్వాదం, రామానాయుడు, కృష్ణా, చేయూత ప్రధాన కార్యదర్శి అలీమ్, కోశాధికారి చింతా నారాయణ మూర్తి తదితర ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రత్నగిరిపై నూతన వ్యాపార దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సత్య ప్రభ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన స్థానిక టీడీపీ నాయకులు వీర్లసూరిబాబు రత్నగిరిపై ఏర్పాటు చేసిన నూతన వ్యాపార దుకాణాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా వ్యాపారం ప్రారంభించిన సూరిబాబు & బ్రదర్స్‌కు అభినందనలు తెలిపి వారి వ్యాపారం అభివృద్ధి చెందాలని, యజమానిగా, లాభాలు గడించాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అనంతబాబుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఎమ్మెల్యే గిరిజన మహిళ మిరియాల శిరీష దేవిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ వారి ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌పై నియోజకవర్గంలోని ఏజెన్సీ మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లలో ఆదివారం ఫిర్యాదులు చేశారు. గత కొన్నాళ్లుగా ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే శిరీష దేవి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్న నేపథ్యంలో రాజకీయంగా వాతావరణం వేడెక్కింది. కాగా రంపచోడవరం మండలం పందిరిమామిడి గ్రామానికి చెందిన పండా చెల్లన్న దొర తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆదివారం రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకట్రావుకు ఫిర్యాదు అందజేశారు. అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ భాస్కర్ ఉద్దేశ్యపూర్వకంగా రంపచోడవరం గిరిజన ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిపై తరచు లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆమె ప్రతిష్టకు భంగం కలిగేలా సామాజిక మాధ్యమాలలో విష ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంత ఉదయ భాస్కర్ అమెరికాలో ఉండి కనుసైగ చేసి తన అనుచరులతో ఎమ్మెల్యేను చంపేస్తానని బహిరంగంగా ప్రకటన చేయడంతో పాటు అతని ప్రవర్తనతో నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రేరేపిస్తున్నట్లు తెలుగుదేశం నాయకులు ఆరోపణలు చేశారు. అలాగే గతంలో అనంత ఉదయ భాస్కర్ అడ్డతీగల ఎంపీపీ, జడ్పిటిసిగా నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతో పదవులు పొందారని, ఆ తర్వాత ఆ ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు రద్దు చేయడంతో ప్రస్తుతం కాపు ఓసి



ఎమ్మెల్సీగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. గతంలో ఎస్టీగా పొందిన రాయితీలు పరిహారం ప్రభుత్వానికి కట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంత బాబు చర్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, ప్రభుత్వ ప్రతిష్టకి విఘాతం కలిగేలా వ్యవహరిస్తున్నందున అతనిపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులు కోరారు. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వున్న అతని ప్రవర్తన వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఈ విషయాలపై పోలీసులు విచారణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదేవిధంగా ఎమ్మెల్సీ అనంత బాబుపై పలు ఏజెన్సీ మండలాల్లో తెలుగుదేశం నాయకులు ఫిర్యాదులు చేశారు.

## ఎమ్మెల్సీ అనంత బాబుపై చట్టపర చర్యలు తీసుకోవాలి

– ఎటపాక స్టేషన్‌లో పిర్యాదు చేసిన టీడీపీ నాయకులు



**ఎటపాక, మేజర్ న్యూస్ :** ఎమ్మెల్సీ అనంత బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎటపాక మండలం టీడీపి నాయకులు ఎటపాక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పిర్యాదు చేశారు. రంపచో డవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్న ఎమ్మెల్సీ అనంత బాబు పై చర్యలు తీసుకోవాలన్నాని, టిడిపి నేతలు స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ రంపచోడవరం నియోజకవర్గం ఎస్టీ ఎమ్మెల్యే అయినటువంటి మిరియాల శిరీషదేవిపై తరచూ ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేస్తున్నాడనీ, ఆయన తీరు వలన ప్రభుత్వ ప్రతిష్టకు కూడా భంగం కలుగుతుంది అని, రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవిపై మానసిక దాడులు చేస్తున్నారని, కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో ఆమె పరువు, ప్రతిష్టలకు తీవ్ర విఘాతం కలిగేలా చేస్తున్నారని, ఆయన వలన ప్రభుత్వంపై కూడా మచ్చ పడేలా ఉందని వారు అన్నారు. అనంత బాబు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నాడనీ, సామాజిక మధ్య మాలలో కూటమి ప్రభుత్వంపై తప్పుడు అభిప్రాయం కలిగేలా వదం తులు సృష్టిస్తున్నారనీ, ఆయన మాటలు ద్వారా నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా భావోద్వేగాలను రెచ్చగొడుతూ అలజడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అనంత బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు కొమరం నాగేష్, పర్షిక రాజు, మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వర రావు, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, నాలజాల మధు, చంద్ర రఘు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న నిత్య అన్నదాన పథకానికి విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంకు చెందిన యర్రంశెట్టి హైమావతి, బంగారు హరికృష్ణ, వారి కుటుంబ సభ్యులు రూ.55 వేలు విరాళంగా సమర్పించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రములుతో సత్కరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.


## తుని పురపాలక సంఘం

ఆర్.ఒ.సి. నెం: 388/2017/ఇ1 తేది. 27.12.2025

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

తుని పురపాలక సంఘము నందు సాధారణ నిధులతో 1 పని చేపట్టి పూర్తి చేయుటకు 'ఇ' ప్రొక్యూర్‌మెంటు ప్లాట్‌ఫారంపై టెండరు ఆహ్వానించడమైనది. సదరు టెండరుకు సంబంధించిన ఇతర వివరములు ది.29-12-2025 ఉదయం గం.11.00 నుండి www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సంప్రదించవలసిన చిరునామా : కమిషనరు, తుని మున్సిపాలిటీ.

ఫోన్ నెం : 9849905806, 9849919375, 0885-4-253506

e-mail : tunimunicipality@gmail.com

సం// ఎ.వెంకటరావు,
కమిషనరు,
తుని పురపాలక సంఘం



మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ఎమ్మెల్సీ అనంత బాబుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన టిడిపి శ్రేణులు





**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ఎమ్మెల్సీ అనంత ఉదయ సత్య భాస్కరపై టిడిపి శ్రేణులు రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పై ఎమ్మెల్సీ ఆనంతబాబు లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆమె కీర్తి ప్రతిష్టల కు భంగం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా మానసిక శోభకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నేను అమెరికాలో ఉండి కను సైగ చేస్తే నా అనుచరులు ఎమ్మెల్యేని చంపేస్తారని ఎమ్మెల్సీ బహిరంగంగా ప్రకటన చేయడం వల్ల, అలానే ఆయన ప్రవర్తనతో నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రేరేపించడం, ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగింది. ఎమ్మెల్యే శిరీష దేవి కొందరు అధికారులు వద్ద లంచం తీసుకుంటుందని బహిరంగంగా నిరాదార ఆరోపణలు చేశారని అలానే తరచూ ఎమ్మెల్యే మానసిక దాడులు చేస్తూ కేవలం రాజకీయ దురుద్దేశంతో ఆమె యొక్క పరువుకు కీర్తికి విఘాతం కలిగేలా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన రెచ్చగొట్టే ధోరణి వల్ల నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. తరచూ ఇలా మాధ్యమాల్లో పురుషాధిపత్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సభలు సమావేశాలు ఏర్పాటు చేసి నియోజకవర్గంలో యుద్ధ వాతావరణానికి పురి గొల్పుతున్నారని ఈయన ప్రవర్తన వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జడ్డంగిలో ఎస్ఐ చినబాబుకు, రాజవొమ్మంగిలో ఏఎస్ఐ చిన్నబ్బాయి రెడ్డికి ఫిర్యాదు పత్రాలు అందజేశారు. ఈ మేరకు విచారణ జరిపి ఎమ్మెల్సీ అనంతబాబుపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా టిడిపి శ్రేణులు కోరారు.

ఈ కార్యక్రమంలో గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతారావ్, వాసంశెట్టి శెట్టి గంగాధర్, లోతా లక్ష్మణరావు, కనిగిరి శ్రీను, మధు, భారంగి అనుదీప్ తదితరులు వున్నారు.

# ఈ నెల 30న శృంగార వల్లభ స్వామి దేవస్థానం నందు ఉత్తర ద్వార దర్శనం



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం, తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానం నందు ఈ నెల 29వ తేదిన స్వామివార్కి ప్రత్యేక అభిషేకం నిర్వహించడం జరుగుతుందని, అలాగే 30వ తేది మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం 3 గంటల నుండి 4.30 గంటల వరకు శ్రీ స్వామివారి మేలుకొలుపు, సుప్రభాత సేవ, 4.30 నుండి రాత్రి 8.30 వరకు ఉత్తర ద్వార దర్శనం ఉచిత దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం కార్య నిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, దేవస్థాన ఛైర్మన్ మొయిళ్ళ సంధ్యకృష్ణమూర్తిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. దీనిలో భాగంగా భక్తులు పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వివిధ భజన బృందాలచే ఏకాహం, గీతా పారాయణం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇఓ వడ్డి శ్రీనివాసరావు, వేదపండితులతో కలసి ఉచిత ద్వార దర్శనం ఏర్పాట్లు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పాల్గొన్నారు.

# పిఠాపురం యాదవ సంఘం అధ్యక్షుడిగా రామన్న రాజు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా వియ్యపు రామన్నరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా యాదవ సంఘం పెద్దలు అల్లు రాజుబాబు, రామకృష్ణ యాదవ్, జోగా వీరవెంకటరమణ యాదవ్ ఆధ్వర్యంలో... పిఠాపురం రైస్ మిల్లర్స్ అసోషియేషన్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన యాదవ సంఘం సమావేశంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా యాదవ సంఘ పెద్దలు, అఖిల భారత యాదవ మహాసభ నాయకులు సమక్షంలో సంఘాన్ని ఏర్పాటు చేశారు. యాదవ సంఘం నూతన కమిటీ ద్వారా యాదవ కులస్తులకు సేవ చేయాలని, వారి కష్టనష్టాల్లో పాలుపంచుకోవాలనే ఉద్దేశ్యంతో యాదవ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా యాదవ సంఘం పెద్దలు స్పష్టం చేశారు. ఏకగ్రీవంగా అందరూ కలిసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామన్నరాజు, ప్రధాన కార్యదర్శిగా ఈగల శ్రీనివాస రావు యాదవ్, కోశాధికారిగా అల్లుబోయిన అప్పలస్వామి యాదవ్, ఉపాధ్యకులుగా మోరుకుర్తి సూరిబాబు యాదవ్, అల్లుబోయిన సూరిబాబు యాదవ్, సహాయ కార్యదర్శులుగా మతం వీరబాబు యాదవ్, వీపు శ్రీనివాస్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా, లొండా త్రిమూర్తులు యాదవ్, నైదన వేణుగోపాల్ యాదవ్ , గొర్ల అనిల్ యాదవ్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం పట్టణ యాదవ కుల పెద్దలు కోన చిన్నారావు యాదవ్, పల్లా శ్రీనివాసరావు, మొల్లి వెంకటరమణ, పంచదార్ల శేషారావు, మొల్లి బాబు, లొండా సత్యనారాయణ, మడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యదేవుని దర్శించుకున్న ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధికి ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభరాజా విచ్చేశారు. ముందుగా దేవస్థానంచైర్మన్ ఐ.వి.రోహిత్ ఆలయ మర్యాదలతోఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి, అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా చైర్మన్ ఐ.వి.రోహిత్ శ్రీస్వామివారి శేష వస్త్రమును, శ్రీ స్వామివారి ప్రసాదమును, శ్రీ స్వామివారి చిత్ర పటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రంగినీడి గంగాధర్‌ను పరామర్శించిన తెదేపా నాయకులు



**పెరవలి,మేజర్‌న్యూస్ :** అన్నవరప్పాడు గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రంగినీడి గంగాధర్ కుమారుడు ఇటీవల కాలం చేసిన సంగతి తెలుసుకున్న పెరవలి మండల తెదేపా నాయకులు డిసెంబర్ 28వ తేదీ ఆదివారం అన్నవరప్పాడు గ్రామానికి వెళ్లి రంగినీడి గంగాధర్ ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ సోదరుడు అన్నవం ప్పాడు గ్రామ ఎక్స్ ఎంపిటిసి తెదేపా నాయకులు రంగినీడి కట్లయ్య తో పాటు రాజమహేంద్రవరం పార్లమెంటు కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రామాంజనేయులు, పార్లమెంట్ కమిటీ కార్యదర్శి దాసం బాపన్ననాయుడు పెరవలి మండల పార్టీ సెక్రటరీ ఇర్రింకి పెద్దిరాజు, హనుమంతు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ.శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం- పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం




పిఠాపురం, మేజర్ న్యూస్ : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న హిందూ సమ్మేళన కార్యక్రమంలో భాగంగా... పిఠాపురం శ్రీ గోపాలబాబా ఆశ్రమం నందు ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలె శ్యామ్ జీ హాజరయ్యారు. హిందూ సమాజంలో ఉన్నవారంతా మన సంస్కృతి సంప్రదాయాలు, వనరులు, ప్రకృతిని కాపాడుకోవాలని, సంతతిని పెంచుకోవాలని తెలిపారు. నృత్య గీతాలు, దేశభక్తి గీతాలతో చేసిన కార్యక్రమం ఆకట్టుకుంది.

వివిధ వృత్తులు చేస్తూ సామాజిక సేవ చేస్తున్న వారిని గుర్తించి సత్కరించారు. ఆర్ఎస్ఎస్ ముఖ్య అధికారి హెడ్గేజీ వేషాధారణలో గట్టి కృష్ణ దేవరాయలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి నియో విద్యాసంస్థల డైరెక్టర్ బుర్రా దివ్యరాజ్ అధ్యక్షత వహించగా, బాదం ఉదయ సూర్య ప్రకాష్, లక్ష్మీనరసాపురం స్వామీజీ, బ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షులు తోలేటి శిరీషా, పిఠాపురం శాఖ బాధ్యులు పెమ్మరాజు సత్య రామచంద్ర రావు, కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, మురళి, కంచెర్ల మహేష్, ఆర్ఎస్ఎస్ సభ్యులు, హిందూ సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 31వ తేదిన ఫించన్లు పంపిణీ

### – ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ



పెద్దాపురంరూరల్, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా ఫించన్లు పంపిణీ పెద్దాపురం మండలంలో 23 గ్రామాల పరిధిలో ఫించన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు31వ తేదిన ఉదయం 7 గంటల నుండి ఫించన్లు పంపిణీ చేయబడునని ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు. 31వ తేదిన తీసుకోని వార్కి 2వ తేదిన పంపిణీ చేయడం జరుగుతుందని, ఎంపిడిఓ తెలిపారు. కావున ఫించన్‌దారులు గమనించాలని ఆయన సూచించారు.

## విశ్వ హైందవ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పోటీలు




పిఠాపురం, మేజర్ న్యూస్ : విశ్వ హైందవ పరిషత్ ఆధ్వర్యంలో... ఒకటి నుండి పదవ తరగతి విద్యార్థులకు మరియు మహిళలకు పిఠాపురం శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం నందు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా బాల్యం నుంచే సత్ప్రవర్తన, సంస్కృతి సాంప్రదాయాల మీద అవగాహన రావాలి అంటే హిందూ సంప్రదాయాలను పాటించడమే కాకుండా భగవద్గీత లాంటి గ్రంథాలను పఠించడం కూడా అలవాటు చేసుకోవాలని విశ్వ హైందవ పరిషత్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మణికుమార్ తెలిపారు.ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు శ్రీ కుక్కుటేశ్వర స్వామి దేవస్థానము ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, కుంతీమాధవస్వామి మరియు వేణుగోపాలస్వామి దేవస్థానం ఈఓ శ్రీ రామ్, కొత్తపల్లిమండల ఎండోమెంట్ ఈఓ శ్రీ ధనలక్ష్మీ, వేణుగోపాలస్వామి ఆలయ పురోహితులు విజయ జనార్ధనాచార్యులు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్య ఆకొండి, ఓబ్ సింగ్, విశ్వ హైందవ పరిషత్ కార్యవర్గ సభ్యులు కనకరాజులు, రమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వంక రవీంద్రనాథ్ జన్మదినం సందర్భంగా పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ



పెరవలి, మేజర్ న్యూస్ : లయన్స్ మల్టిపుల్ ఎక్స్ చైర్ పర్సన్ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 28వ తేదీ ఆదివారం వేదనిధి లిమిటెడ్ చైర్మన్ గడుగొయ్యల వివేకానంద స్వామి మరియు మేనేజింగ్ డైరెక్టర్ గడుగొయ్యల మణితేజలు తణుకు కొండాలమ్మ పుంత దగ్గర డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న 50 మంది నిరుపేదలకు స్వీట్స్ ,దుప్పట్లు పంచిపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా గడుగొయ్యల వివేకానంద స్వామి మేజర్ న్యూస్‌తో మాట్లాడుతూ తమ లీడర్ వంక రవీంద్రనాథ్ జన్మదినం సందర్భంగా ఆయన చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేయాలను కున్నామని అయితే తమ లీడర్ వంక రవీంద్రనాథ్ అందుబాటులో లేకపోవడంతో తాము పంచిపెట్టామని అన్నారు.

## వెంకన్న క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్



పెరవలి, మేజర్ న్యూస్ : అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 2026 వ నూతన సంవత్సర క్యాలెండర్‌ను డిసెంబర్ 28వ తేదీ ఆదివారం ఆంధ్రప్రదేశ్ పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి రెండు కోట్ల రూపాయలు పుష్కర నిధులు పునర్నిర్మాణము నిమిత్తము మంజూరు చేయించి నందుకు ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు గ్రామస్తులు మరియు కార్య నిర్వహణ అధికారి మీసాల రాధాకృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు.

## సామర్లకోట - కాకినాడ రోడ్డుపై కొండచిలువ



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట కాకినాడ రోడ్డులో కొండ చిలువ ఆదివారం సాయంత్రం ప్రత్యక్షమైంది. అయ్యప్ప స్వామి ఆలయము సమీపంలో ఐదు తూములు వద్ద సుమారు 10 అడుగుల కొండ చిలువ రోడ్డు దాటుతూ కనిపించింది. దీంతో రోడ్డు మీద ప్రయాణం చేసే ప్రయాణికులు ఆందోళన చెందారు.

## నేడు మున్సిపల్ కౌన్సిల్ (బడ్జెట్) సమావేశం



పెద్దాపురం, మేజర్ న్యూస్ : ఈ నెల 29వ తేదిన సోమవారం ఉదయం 11 గంటలకు, మున్సిపల్ కౌన్సిల్ హాలు నందు కౌన్సిల్ సాధారణ కమిటి సమావేశం, కాంట్రాక్ట్ కమిటి సమావేశం, అనంతరం 2026–27 బడ్జెట్ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొద్దు తులసి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించబడునని, కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈ సమావేశంలో వైస్‌ఛైర్మన్లు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొనసున్నారని, కమీషనర్ తెలిపారు. కావున పురపాలక సంఘ వివిధ శాఖల విభాగాధిపతులు విధిగా హాజరు కావాలని, కమీషనర్ తెలిపారు.

## విద్యుత్ సరఫరా అంతరాయం

పెరవలి, మేజర్ న్యూస్ : పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో డిసెంబర్ 29 వ తేదీ సోమవారం ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఆర్డిఎస్ఎస్ పనులలో భాగంగా 24 గంటల విద్యుత్ సరఫరా కొరకు 33/11 కె.వి పెరవలి సబ్‌స్టేషన్ పరిధిలో గల అజ్జరం, వెంకటరాయపురం గ్రామములకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. వ్యవసాయ విద్యుత్ ఉదయం 04.00 గంటల నుండి 10:00 గంటల వరకు మరియు సాయంత్రం 04.00 గంటల నుండి 06:00 గంటల వరకు కొనసాగించబడును . కావున గృహవిద్యుత్ వినియోగదారులు సహకరించవల సినదిగా ఎన్.నారాయణ అప్పారావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ వారు కోరారు.

## ఆర్డీఓ కార్యాలయంలో పిజిఆర్ఎస్ నిర్వహణ

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి నిర్వహించడం జరుగుతుందని, ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమానికి కార్యాలయ ఏఓ మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, కావున 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆర్డీఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# 100 రోజులు యాక్షన్ ప్లాన్ విద్యార్థులకు శాపం

**– హై స్కూల్ సెలవు దినాల్లో పని చేయమని ఇచ్చిన ఉత్తర్వులు సవరించాలని ఉపాధ్యాయ డిమాండ్**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం ఎస్‌టియు మండల శాఖ మొదటి కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు అడపా శ్రీనివాస్ అధ్యక్షతన రావులపాలెం బాయ్స్ హై స్కూల్ నందు ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్‌టియు ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు కె.వి.శేఖర్ హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ 100 డేస్ ఏక్షన్ ప్లాన్ అంటూ 10వ తరగతి విద్యార్థుల కొరకు ప్రవేశపెట్టిన ప్రణాలిక విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పెను భారంగా మారిందని దానిని ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయులు తరపున ఈయన డిమాండ్ చేశారు. దీనిలో ఆదివారం, రెండవ శనివారం పండుగ దినాల్లో కూడ పని చేయమని అలాగే ప్రతిరోజూ టెస్ట్ పెట్టి ఆ మార్కుల ఆన్‌లైన్‌లో వెంటనే నోట్ చేయమనడం, విద్యార్థులు హాజరుకాకపోతే ఉపాధ్యాయలే బాద్యులు అంటూ బెదిరింపులు చేయడం నరకయాతనగా ఉందని, చేసేపని ఇష్టంగా చేసేలా ఉండాలి గాని టార్చర్ మాదిరి ఉండకూడదు అన్నారు. విద్యాశాఖ మంత్రి వెంటనే ఉపాద్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి పాఠశాల, విద్యార్థుల, ఉపాద్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అనంతరం రావులపాలెం మండలం నుండి రాష్ట్ర స్థాయిలో ఎస్‌టియు అధికార మాస పత్రికకు కోస్తా జిల్లాల్లో నుండి మొదటిసారిగా చీఫ్ ఎడిటర్‌గా ఎన్నిక అయిన కె.వి.శేఖర్‌ను దుస్సాలువా, మెమొంటో, పూల దండలతో ఘనంగా సత్కరించారు.ఈ సమావేశంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు పి.మరియన్ రాజు, జిల్లా బాధ్యులు కె.కింగ్, సిహెచ్.నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, మహిళా కార్యదర్శి ఉమ కాంతం, పొడగట్లపల్లి ప్రథమ ఉపాధ్యాయులు శేషుకుమార్, సూరిబాబు, ఆర్థిక కార్యదర్శి శ్రీరామ్, పి.సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, ఇమ్మనేయులు, కె.ఎన్.వి.నారాయణ, బీ.వీ.యస్. రామారావు, కృష్ణారావు, వీరబాబు, సత్తిబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

# అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అలై.శరవణ్ కుమార్ 30వ జన్మదిన వేడుకలు

**– పేదలకు చీరల పంపిణీ**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** సేవే మార్గం.. మానవత్వమే లక్ష్యంగా అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో అలై. శరవణ్ కుమార్ 30వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.కాకినాడ వెంకట్ నగర్‌లోని శ్రీ నివాసం అపార్ట్‌మెంట్ వద్ద ఆదివారం జరిగిన ఈకార్యక్రమంలో శరవణ్ కుమార్ జ్ఞాపకార్థం సమీప స్లమ్ ప్రాంత మహిళలకు చీరలను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు.

సేవతోనే సార్థకత :ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు యాళ్ళ రత్నరావు మాట్లాడుతూ, వ్యక్తిగత వేడుకలను సేవా కార్యక్రమాలతో ముడిపెట్టడం అలయన్స్ క్లబ్ యొక్క విశిష్టత అని తెలిపారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన అలై. పెంకే గోవిందరాజు మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సామాజిక బాధ్యతను, ఐక్యతను పెంపొందిస్తాయని కొనియాడారు.పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్అలై.కొవ్వూరి మునిరెడ్డి మాట్లాడుతూ, యువత తమ వేడుకలను సేవతో జరుపుకోవడం ద్వారానే వాటికి నిజమైన అర్థం లభిస్తుందని సూచించారు. క్లబ్ వ్యవస్థాపకులు అలై. దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ, శరవణ్ కుమార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన స్మారకార్థం చేపట్టిన ఈ సేవ ఎందరికో స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు అలై. యాదవిల్లి మురళీధర్, అలై. టి.ఆర్.ఠాగూర్, సెక్రటరీ అలై. ధూళిపూడి రామకృష్ణ, కోశాధికారి అలై. దామిశెట్టి శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ అలై.శివకుమార్ పాల్గొన్నారు. అలాగే క్లబ్ సభ్యులు అలై.చ.రామమోహన్ రావు, అలై.పడాల సూర్యనారాయణ రెడ్డి,అలై. బండారు భాస్కరరావు, అలై.పి.విజయలక్ష్మి, అలై.వి.ఉష,అలై. కే.చంద్ర శేఖర్, అలై.డా.డి.వి.వి.సత్యనారాయణ, అలై.జె.ఎస్.వి.లక్ష్మావతి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలో భాగస్వాములయ్యారు.

# అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రధ సేవ

**– పాల్గొన్న ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా, దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్**



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శ్రీ సత్యదేవుని రధ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు.

ముందుగా ఆలయ అర్చకులు శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి రధ వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళ, వాయిద్యాల నడుమ ఆలయ చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. రధ సేవ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఐ.వి. రోహిత్, స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దండు సాయి ఆకాష్ వర్మ మెమోరబుల్ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు

**– విజేతలుగా ఈస్ట్ గోదావరి జిల్లా మెన్స్ టీమ్ మరియు కృష్ణా జిల్లా ఉమెన్స్ టీమ్**

**– విజేతలుగా నిలిచిన జిల్లా టీమ్‌లకు ట్రోఫీ అందజేసిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యేశ్వర వర్మ ఆధ్వర్యంలో దండు సాయి ఆకాష్ వర్మ మెమోరబుల్ టోర్నమెంట్ 10వ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్షిప్ పోటీల కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. అతి చిన్నవయసులోనే రాష్ట్ర స్థాయి నెట్ బాల్ ఆటలో అత్యున్నత ప్రతిభ కనబరిచి దురదృష్టవసాత్తు అకాల మరణానికి గురైన దండు సాయి ఆకాష్ వర్మ ఆసక్తి మేరకు తన తండ్రి దండు సుబ్రహ్మణ్యేశ్వర వర్మ ఈ రాష్ట్ర స్థాయి పోటీలను వెదిరేశ్వరం గ్రామంలో నిర్వహించటం జరిగింది.

అనంతరం ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన ఈస్ట్ గోదావరి జిల్లా మెన్స్ టీం మరియు కృష్ణాజిల్లా ఉమెన్స్ టీమ్ లకు ఆయన చేతుల మీదుగా ట్రోఫీ అందజేయడం జరిగింది. అనంతరం వివిధ జిల్లాల నుండి విచ్చేసిన క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మరియు ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** జాతీయ సేవా పథకం యూనిట్-1 ఆధ్వర్యంలో సాంబమూర్తినగర్‌లో గల అంబేద్కర్ పార్క్‌లో ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు పార్క్‌ను శుభ్రపరిచి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ&పి.జి కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥బి.యి.వి.యల్. నాయుడు మాట్లాడుతూ చెట్లు ప్రకృతిలో అందాల కోసం మాత్రమే కాదు, అనేక ప్రయోజనాలు ఇస్తాయని, ఇవి పర్యావరణ సమత్యులతకు దోహదం చేస్తాయని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ చెట్లు ప్రగతికి మెట్లు. చెట్లు పెంచండి-పర్యావరణని పరిరక్షించండి అని చెప్పడం ప్రభుత్వం భాద్యత మాత్రమే కాదు, ఇది మనందరి భాద్యత అని తెలియజేశారు. చెట్లు గాలి నుంచి హానికరమైన కాలుష్య కారకలను ఆశ్చర్యపరిచే మొత్తంలో తొలగిస్తాయి. పట్టణ ప్రాంతాలలో గాలి నాణ్యత తరుచుగా తగ్గుతుంది. గాలి నాణ్యత పెరగడానికి మనకున్న ఒకే మార్గం చెట్లు పెంచడం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతు చెట్లు మానవులకు చాలా రకాలుగా ఉపయోగపడతాయి. చెట్లవలన గాలి, నీడ, ఆహారం, మరెన్నో లభిస్తాయి అని తెలియజేశారు. కార్యక్రమంలో జాతీయసేవా పథక కార్యనిర్వహణాధికారి యమ్.శ్రీనివాస్, అస్టిస్టెంట్ ప్రొగ్రాం ఆఫీసర్ కుమారి. కె.నవ్య, మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.